క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన సీఐ



సతీష్‌కుమార్

పాల్వంచ: పాల్వంచ సీఐగా కె.సతీష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ వి.వినయ్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీ కాగా, ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ నుంచి సతీష్‌కుమార్ ఇక్కడికి వచ్చారు.

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

ఇల్లెందు/టేకులపల్లి: పేదలు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 142 మందికి రూ.1.58 కోట్ల విలువగల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అదే విధంగా టేకులపల్లి మండల కేంద్రంలో 131 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, డీఎస్పీ చంద్రభాను, తహసీల్దార్ కె.రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు..



సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: చల్లసముద్రం ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థినులకు రోటరీ క్లబ్ సహకారంతో శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోటు రవి, సలీం మాట్లాడుతూ.. దూరప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసించే విద్యార్థినులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఈ సహకారం అందించిందని చెప్పారు.

బ్యాగులు, నోట్ పుస్తకాలు..

పాల్వంచరూరల్: రంగాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు ఆర్ఎం.వెంకటాద్రి బ్యాగులు, నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు.

కార్మికులకు చీరలు..

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామానికి చెందిన భూక్యా చందా నాయక్, జ్యోతి దంపతులు శుక్రవారం పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

పీవైఎల్ కార్యవర్గం ఎన్నిక

ఇల్లెందురూరల్: మాస్‌లైన్ అనుబంధ పీవైఎల్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా ఎలుగు శాంతారావు, అధ్యక్షుడిగా ఆజ్మీర ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా బాదావత్ రమేష్, బయ్యా వెంకన్న, వల్లోజు చంద్రశేఖర్, ఈసాల సురేష్, కోడి కృష్ణ, ఆజ్మీర సీతారాం, బట్టు ఎర్రయ్య, బానోత్ మనోహర్, కారం నగేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా పీవైఎల్ శ్రేణులు ఉద్యమించాలని కోరారు. యువత పెడదోవ పట్టకుండా విద్య, ఉపాధి వనరులు మెరుగుపడేలా ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. నాయిని రాజు, బుర్ర రాఘవులు, ఆజ్మీర బిచ్చా, శంకర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం



పద్మావతిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు


కొత్తగూడెంరూరల్: మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పద్మావతిని గురువారం హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో పోలీసు అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, ఆర్ఐ హోమ్ గార్డ్స్ జి.నర్సింహారావు, ఆర్ఎస్ఐ సత్తార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటం ఏర్పాటు చేయండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో జాతీయ పతాకాన్ని ఎగురవేసే ప్రతీచోట ఏర్పాటు చేయాలని మాలమహానాడు, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. మొదట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కోట శివశంకర్, వాసుమళ్ల సుందర్ రావు మాట్లాడుతూ.. అంబేద్కర్ పేరును ప్రపంచానికి తెలియకుండా కొంతమంది కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో దారా చిరంజీవి, తోటమల్ల రమణమూర్తి, ఎడెల్లి గణపతి, పల్లంటి రమేష్, వెంకటేశ్వర్లు, పప్పుల జయ పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అక్రమాలకు చెక్..

- ఇక సెల్‌ఫోన్‌లో సమస్త సమాచారం
- అందుబాటులోకి జన్‌మన్‌రేగా యాప్
- వందరోజుల పనుల్లో పారదర్శకత



జన్‌మన్‌రేగా యాప్



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

చుంచుపల్లి: ఉన్న ఊరిలో ఉపాధి కల్పించి వలసలు నివారించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సత్ఫలితాలిస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు ఏడాదికి వంద రోజుల పని కల్పిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో మొత్తం 266 రకాల పనులు చేపట్టవచ్చు. అయితే స్థానిక వనరులను బట్టి ఆయా ప్రాంతాల్లో 70 రకాల పనులు చేస్తున్నారు. ఈ వంద రోజుల పనుల్లో ప్రధానంగా పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, మరుగుదొడ్లు, అనుసంధాన రహదారులు, ఇంకుడుగుంతలు, చెక్ డ్యాంల నిర్మాణంతో పాటు పంట కాల్వల్లో పూడిక తీయటం, వ్యవసాయ అనుబంధ రంగాలైన ఫారం పాండ్స్, చేపల చెరువులు, చదును, కందకాల తవ్వకాలు, నీటి కాలువలు, అమృత సరోవరం చెరువుల నిర్మాణం, పొలాలకు వెళ్లేలా మట్టి రహదారుల నిర్మాణం, పాడిపరిశ్రమ, కోళ్లు, మేకల పెంపకానికి కావాల్సిన షెడ్లు, మొక్కల పెంపకం వంటివి వాటికి ప్రాధాన్యమివ్వనున్నారు. ఉపాధి హామీలో పారదర్శకత పెంచి అక్రమాలకు తావివ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలు తెస్తున్నాయి. కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా లబ్ధిదారుడికి బ్యాంకు, పోస్టాఫీస్ ఖాతాలు తెరిచి నేరుగా చెల్లింపులు చేస్తున్నారు. ఒకరికే రెండు మూడు ఖాతాలు ఉండటంతో ఎందులో జమ చేశారో తెలుసుకోవడం ఇబ్బందవుతోంది. అందుకే కేంద్ర ప్రభుత్వం కొత్తగా ‘జన్‌మన్‌రేగా’యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

జన్‌మన్ యాప్‌తో ప్రయోజనాలు..

చుంచుపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 7,385 జాబ్‌కార్డులు ఉండగా, వాటి పరిధిలో 14,068 మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. ఇందులో ప్రస్తుతం 2,939 యాక్టివ్ జాబ్ కార్డుల పరిధిలో దాదాపు 5వేలకుపైగా మంది కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతీ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు వందరోజుల పనులు జోరుగుగా జరుగుతుంటాయి. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన జన్‌మన్‌నరేగా యాప్‌ను ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వేతనాలు, పనిదినాలకు సంబంధించిన ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబం ఐడీ వివరాలు నమోదు చేయాలి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరు మీద క్లిక్ చేస్తే ఎక్కడ పని చేశారు, పని దినాల సంఖ్య, ఎంత వేతనం, ఎప్పుడు జమ చేశారు, ఏ బ్యాంకు వివరాలు ఉంటాయి. ఉపాధి హామీ డబ్బులు జమ కాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించి ఆధార్ లింకు అయిందా, ఆధార్‌లో పోలిన విధంగా బ్యాంకు వివరాలు ఉన్నాయా, ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టం (ఏబీపీఎస్) లింక్ అయిందో లేదో వివరాలుంటాయి. ఒకవేళ అన్నీ లింకైతే పచ్చరంగులో రైట్ గుర్తు ఉంటుంది. లేదంటే ఎరుపు రంగులో తప్పు గుర్తు ఉంటుంది. జాబ్‌కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. అందుకు అటెండెన్స్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పని చేశారు. ఎవరెవరు ఎన్ని రోజులు సద్వినియోగం చేసుకున్నారో అనే వివరాలు ఉంటాయి.

యాప్‌తో పారదర్శకత పెరుగుతుంది..



వంద రోజుల పనులకు వచ్చే ఉపాధి కూలీల వేతనాల చెల్లింపుల్లో అక్రమాలు జరగొద్దని కేంద్ర ప్రభుత్వం తాజాగా జన్‌మన్‌రేగా యాప్ తీసుకొచ్చింది. కూలీలు తమ వివరాలు అందులో సమగ్రంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల పథకం అమల్లో పారదర్శకత పెరుగుతుంది. ఉపాధి హామీలో సాంకేతికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పద్ధతులు అమల్లోకి తెస్తున్నాయి. – **రఘుపతి, ఏపీఓ, చుంచుపల్లి**

ఆర్టీసీలో ఘనంగా డ్రైవర్ల డే



మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

చుంచుపల్లి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం డిపోలో డ్రైవర్ల డే ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మొదట డ్యూటీకి వెళ్తున్న డ్రైవర్లకు సురక్షితమైన డ్రైవింగ్ చేస్తున్నందుకు పూలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ విద్యార్థులతో పట్టణంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తగూడెం డిపోలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వన్ టౌన్ సీఐ కరుణాకర్ చేతుల మీదుగా డ్రైవర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, సూపర్‌వైజర్లు రమేష్, ఆర్ఆర్‌కే ప్రసాద్, సురేష్, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ భాగ్యలక్ష్మి, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు సీపీఆర్‌పై అవగాహన..

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, డ్రైవర్స్ డే సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం ఆర్టీసీ బస్సు డిపోలో డ్రైవర్లకు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ.. సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవడం తప్పనిసరి అన్నారు. వ్యక్తి గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు సీపీఆర్ అత్యవసర ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ రాకేష్, డాక్టర్ శివకుమార్, డిప్యూటీ డెమో మొహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఇంజనీర్లను బదిలీ చేయండి..



జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: జెన్‌కో సంస్థలో పనిచేస్తున్న ఇంజనీర్లకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లు ఇవ్వాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కేటీపీఎస్ 5,6,7 బ్రాంచ్ సెక్రటరీలు డి.ఉమామహేశ్వరరావు, యాస్మిన్ కోరారు. శుక్రవారం స్థానిక కేటీపీఎస్ గెస్ట్ హౌజ్‌లో జెన్‌కో డైరెక్టర్ బి.లక్ష్మయ్యను కలిసి వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. 2012 బ్యాచ్ ఇంజనీర్లకు పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాలని, కేటీపీఎస్‌లో నూతనంగా రెండు 800 మెగావాట్ల థర్మల్ పవర్ స్టేషన్లు మంజూరు చేయాలని, 1999 నుంచి 2004 వరకు రిక్రూట్ అయిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంపత్, చంద్రకళాధర్, లక్ష్మి, దివాకర్, రాజేష్, యాకూబ్, శ్రీకాంత్, మధుబాబు, మధుసూదన్, రామారావు, గణేష్, భాస్కర్, శ్రావణ్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

‘సీనియర్ కార్మికులకు అన్యాయం’

సింగరేణి(కొత్తగూడెం): ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రుద్రంపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ట్రేడ్స్‌మెన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.వీరస్వామి ఏరియా బ్రాంచి కార్యదర్శి మల్లికార్జున్‌రావు హాజరయ్యారు.

మాట్లాడుతూ... ఏరియాలోని పీవీకే-5 షాఫ్ట్ గనిలో పనిచేస్తున్న ట్రేడ్స్‌మెన్ల సమస్యలపై చర్చించారు. డిప్యూటేషన్లలో అన్యాయం జరుగుతోందని, జూనియర్ కార్మికులను సర్వేస్ డిపార్ట్‌మెంట్లకు పంపిస్తూ సీనియర్ కార్మికులకు అన్యాయం చేస్తున్నట్లు చెప్పారు. అనేక ఏళ్లుగా ఏఐటీయూసీ యూనియన్ ప్రతీ కార్మికుడికి న్యాయం చేస్తోందని, అనేక హక్కులు సాధించి పెట్టిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. ఈ కార్యక్రమంలో గట్టయ్య, కత్తెర్ల రాములు, శ్రీనివాస్, మధుకృష్ణ, కుర్రు రమేష్, శ్రీనివాసరావు, బండి రమణ, భూపతి శ్రీను, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



సుజాతనగర్: హాజరైన విద్యార్థినులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ... బాలికలు పట్టుదలతో, ధైర్యంతో చదవాలని చదువే అన్నింటికీ పరిష్కారం అన్నారు. విద్యార్థినులకు జామెట్రీ బాక్స్‌లు, వారి తల్లులకు చీరలను అందజేశారు.

ఇల్లెందు: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి ఉచిత నిర్బంధ విద్యను పెంపొందించుకోవాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. శుక్రవారం ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్నతనంలో బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, వీరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుజాతనగర్: సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.పూర్ణమ్మ మాట్లాడుతూ... ఆడపిల్లలు వంటింటికే పరిమితం కాదని, నేడు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో ప్రతిభ చూపుతున్నారన్నారు. ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రులు మాకు ఆడపిల్లే కావాలనే విధంగా గర్వంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, చంద్రమౌళి, ఆయిషా, జ్యోతి నాగలక్ష్మి, ధరణి, కృష్ణకుమారి, శ్రీనివాస్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వితరణ..

టేకులపల్లి: తడికలపూడి ప్రాథమిక పాఠశాలకు నవభారత్ యాజమాన్యం రూ.47లక్షలు వితరణ చేసింది. వాటితో పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం నవభారత్ యాజమాన్యం ప్రతినిధుతో కలిసి ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రహరీ, వాష్ రూంలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోరం సురేందర్, చిట్టిబాబు, నవభారత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి..

సుజాతనగర్: నేటి నుంచి ఈ నెల 28 వరకు సంగారెడ్డిలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభల విజయవంతం కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య బెలూన్లు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. దేశానికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనని, పేదవాడికి ఎర్రజెండా ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న మహాసభలకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, శ్రీనివాస్, నల్లగోవు పుల్లయ్య, ఉడుగుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యారులకు దాతలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగం పవన్ కుమార్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి శిరీష్ ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున రూ.లక్ష నగదు అందించారు. అదేవిధంగా ఆళ్ల గోపయ్య ట్రస్ట్ నిర్వాహకులు ఆళ్ల హరిణి ఒక విద్యార్థికి రూ.20వేలను అందజేశారు.

కవాతు పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఆధ్వర్యంలో ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ హాజరై సెక్యూరిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా కవాతును జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరి శ్రీనివాస్‌రావు శుక్రవారం పరిశీలించి స్వీకరించారు. కార్యక్రమంలో జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ, డీజీఎం రాజేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని సెంట్రల్ ఆటో వర్క్‌షాపులో ఖాళీలను పూర్తి చేయాలని సీఐటీయూ నాయకులు సింగరేణి అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేట్ ట్రాన్స్‌పోర్ట్ జీఎం సీతారామం, డీవైఎస్ఈ రామశేషయ్యలకు నాయకులు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఇక్కడ అపాయింట్‌మెంట్ అయిన వారు ఇక్కడే దిగిపోతున్నారని వారిస్థానంలో కొత్తవారిని రిక్రూట్ చేయటం లేదన్నారు. మందా నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్, గాజుల రాజారావు, వై.వెంకటేశ్వరరావు, సూరం అయిలయ్య, సందీప్, రవి పాల్గొన్నారు.

ఐదేళ్లలో రూ.130 కోట్ల అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: గడిచిన ఐదేళ్లలో ఇల్లెందు పట్టణాభివృద్ధికి విశేషంగా కృషి చేశామని, సుమారు రూ.130 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలిసి ‘ఐదేళ్ల పాలన – సాధించిన అభివృద్ధి’ని వివరించారు. ఒడిదొడుకుల మధ్య అధికారులు, కౌన్సిలర్ల సహాయంతో పట్టణాభివృద్ధికి పాటుపడి కేంద్ర, రాష్ట్రర ప్రభుత్వాల నుంచి ఎన్నో అవార్డులు, ప్రశంసలు పొందినట్లు తెలిపారు. ముఖ్యంగా పట్టణాన్ని ముంచే బుగ్గవాగు పూడిక తీసి సుమారు 500 ఇళ్లను ముంపు నుంచి కాపాడామని తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచామని, దహనం చేసేందుకు సొంతవారు కూడా దగ్గరికి వచ్చే పరిస్థితి లేకుంటే 28 మందికి అంతిక్రియలు నిర్వహించామన్నారు. పట్టణంలో రూ.1 పంపు కనెక్షన్‌ఇచ్చి అందరికీ తాగునీరు అందించినట్లు చెప్పారు. 90 శాతం మిషన్ భగీరథ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్త కాలనీలో అన్ని ఇళ్లకు ఇంటి నంబర్లు ఇచ్చామన్నారు. మున్సిపల్ ఆదాయం పెరిగేలా ఇల్లెందులో వ్యాపారులకు 305 గదులు నిర్మించినట్లు తెలిపారు. మొయిన్ రోడ్డు నిర్మాణం, సీసీ రోడ్లు, ఆంబజార్ రోడ్డు, వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం వల్ల పట్టణానికి మూడుసార్లు జాతీయ స్థాయి, రెండుసార్లు రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయని తెలిపారు. పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన సదస్సులకు ఆహ్వానాలు అందాయని పేర్కొన్నారు. ఒకనాడు ఇల్లెందును చూసిన వారు భయపడే వారని, ఇప్పుడు ఇల్లెందు రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, వారా రవి, అంకెపాక నవీన్, సయ్యద్ ఆజం, కటకం పద్మావతి, మొగిలి లక్ష్మి, పత్తి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్‌లో గదుల కేటాయింపు

మోడల్ మార్కెట్‌లో గదుల కేటాయింపు ప్రక్రియ ఆటంకాలు అధిగమిస్తూ ఎట్టకేలకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పోలీస్ బందోబస్తు మధ్య పూర్తి చేశారు. ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, ఆర్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కింది అంతస్తులోని 96 గదులకు గానూ 93 గదులకు లాటరీ పద్ధతిలో కేటాయించారు. వీటిని కూరగాయలు, ఆకుకూరలు, చేపల విక్రయదారులకు కేటాయించారు. ఇతరులకు పైఅంతస్తులో గదులను కేటాయిస్తామని ప్రకటించారు.

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి



బహుమతులు అందిస్తున్న కొత్వాల

పాల్వంచ: క్రీడాకారులు తమ ప్రతిభతో గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాత పాల్వంచలోని సాయి యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఫరీద్-7 జట్టు ప్రథమ స్థానంలో నిలవగా యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్ రూ.30వేలు నగదు, ఫీల్డ్ స్పాన్సర్ చేశారు. యాసిన్-7 ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి పాత పాల్వంచకు చిన్న పండు రూ.15వేల నగదు, ఫీల్డ్ స్పాన్సర్ చేశారు. విజేతలకు కొత్వాల బహుమతులు అందించారు. కార్యక్రమంలో గంగపురి శశి, కంచర్ల ప్రవీణ్, గంగపురి సతీష్, ముత్తయ్య, కందుకూరి రాము, శాంతివర్ధన్, ఫరీద్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో అర్హులకు మొండి చేయి..



మాట్లాడుతున్న రమేష్

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాలో అర్హులకు మొండి చేయి చూపించారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ఆరోపించారు. శుక్రవారం జూలూరుపాడులో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అర్హుల జాబితా తప్పుల తడకలా ఉందన్నారు. పేదలు అద్దె ఇళ్లల్లో, రెండు, మూడు కుటుంబాలు ఒకే ఇంట్లో మగ్గుతున్నా అర్హుల జాబితాలో లేరన్నారు. కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. వ్యవసాయ కూలీలు వందల సంఖ్యలో ఉంటే పదుల సంఖ్యలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మహిళలకు రూ.2,500, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4,000 పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.సతీష్, తెల్లం నరసింహారావు, సిరిపురపు ప్రసాద్, గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు, వందనపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించండి..



మాట్లాడుతున్న గోపాల్‌రావు, ధర్మా

జూలూరుపాడు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు వై.గోపాల్‌రావు, మండల కార్యదర్శి బానోత్ ధర్మా డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం గ్రామసభలు నిర్వహించి, నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పి, అర్హుల పేర్లు లేకుండా ప్రజలను గందరగోళానికి గురిచేశారని విమర్శించారు. సంక్షేమ పథకాల జాబితాల్లో అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేయకుండా, అనర్హులకు చోటు దక్కడం అధికార యంత్రాంగమే కారణమన్నారు. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. ఉపాధిలో 20 రోజులు పని చేసిన వారికి ఇస్తామన్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిబంధనను తొలగించి భూమి లేనివారికి వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో కంగాల వెంకటమ్మ, సమంధల మధు, కంగాల రంజిత్, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘సంక్షేమం’లో పేదలకు న్యాయం చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సంక్షేమ పథకాల అమలులో అర్హులకు న్యాయం చేయాలని, ప్రజలకు భరోసా ఇవ్వని గ్రామసభలు ప్రభుత్వం నుంచి స్పష్టత లోపించడమే కారణమని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడానికి ఎంపికలో అవకతకలు జరుగుతున్నాయని, గ్రామసభలు ప్రజలకు భరోసా ఇవ్వలేదన్నారు.

ప్రభుత్వం నుంచి స్పష్టత లోపించడమే ఇందుకు కారణమన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రజలు తమకు రేషన్ కార్డు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేవని అయినా జాబితాలో పేరు రాలేదని దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు



సుజాతనగర్: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు జీఎం కార్యాయలయంలో, సింగరేణి ఆస్పత్రిలో రోడ్డు భద్రత, ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. సింగరేణి హెల్త్ క్యాలెండర్‌లో భాగంగా ఈ జనవరిలో రోడ్డు భద్రత, బయో మెడికల్ వేస్టేజ్‌లపై అవగాహన కల్పించమన్నారని తెలిపారు. బైక్‌లపై ప్రయాణించేటప్పుడు తప్పక హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్ట్ పెట్టుకోలన్నారు. అదేవిధంగా వాహనాలు అతివేగంగా నడపపొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించటం వలన మీతో పాటు మీ కుటుంబ సభ్యులు భద్రంగా ఉంటారన్నారు. హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ.. హ్యూమన్ మోటాప్నూమో వైరస్ గురించి వివరించారు. పిల్లలు, వృద్ధులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు.

సుజాతనగర్: రోడ్డు భద్రతా నియమాలను అందరూ పాటించాలని సుజాతనగర్ ఎస్ఐ ఎం.రమాదేవి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ధన్వంతరి కళాశాల విద్యార్థులతో మండల కేంద్రంలో శుక్రవారం రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు, యువకులకు ట్రాఫిక్ నిబంధలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.